ప్రజాశక్తి
బుధవారం 14 మే 2025
5
విజయనగరం



సిబిఎస్ఇ ఫలితాల్లో విద్యార్థుల హవా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిబిఎస్ఇ పది, 12 తరగతుల ఫలితాలలో కిల్తంపాలెం నవోదయ విద్యాలయం, నగరంలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు సత్తాచాటారు. నవోదయ పాఠశాలలో నూరు శాతం ఫలితాలు సాధించారు. 12వ తరగిలో 37 మందికి అందరూ,పదో తరగతిలో 78 మందికి నూరుశాత ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ వి.దుర్గాప్రసాద్ తెలిపారు. కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతిలో సుహాని గహన 569 మార్కులతో ప్రథమ స్థానం, వై. చరణ్ కార్తికేయ 568 మార్కులతో ద్వితీయ స్థానం, కె. రమ్యశ్రీ 567 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. పన్నెండవ తరగతిలో ప్రవీణ్ బెహరా 565 మార్కులతో ప్రథమ స్థానం, చెల్లూరి సందీప్-544 ద్వితీయ స్థానం , ఆర్టికట్ల లోకేశ్వరి, రేజేటి సాత్విక 524 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. వీరిని ప్రిన్సిపాల్ దిలీప్‌మోడీ అభినందించారు. పదకొండవ తరగతి ప్రవేశాలకు ఈనెల 14 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

ఔను..! పాలన బాగోలేదు

డిఆర్‌సి సాక్షిగా అంగీకరించిన ఎంపి, ఎమ్మెల్యేలు● మంత్రుల నోటా ఇదే మాట ●ఎప్పటికి గాడిలో పడుతుందో!

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'ఔను...! జిల్లాలో పరిపాలన ఏం బాగోలేదు... నాసిరకం మద్యం విక్రయిస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మనకి తెలియందేమీ కాదు. ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపు ఇంకా కొనసాగుతోంది. ఆక్రమణలు, ప్రభుత్వ నిధులతో ప్రైవేటు అవసరాలకు రోడ్ల నిర్మాణ పనులూ చేపడుతున్నారు....' ఇదేదో ప్రతిపక్ష నాయకులు చేసిన విమర్శలు కాదు సుమా..! సాక్షాత్తు జిల్లా సమీక్షా మండలి (డిఆర్‌సి) సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సహా మంత్రులు కూడా అంగీకరించిన మాటలు. అంతా బాగుందంటూ బుకాయించే కన్నా వాస్తవాలను అంగీకరించడం మంచిదే. ఆహ్వానించదగ్గ పరిణామమే. కానీ, వాటిని ఏమేరకు సరిద్దుతారన్నదే ఇక్కడ కీలకాంశం. లోపాలను అంగీకరించడం ఎంత ముఖ్యమో వాటిని అధిగమించేందుకు తగిన కార్యాచరణ, దాని అమలు, పర్యవేక్షణ కూడా అంతే కీలకం. అటువంటి చర్యలు చేపడతామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఒకింత హుందాగా చెప్పనే, అదేతరహాలో సమావేశం నిర్వహించారు.

మంత్రి అనిత అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశం కొన్ని అంశాలపై హాట్‌హాట్‌గానే సాగింది. ముఖ్యంగా డ్వామా పరిధిలోని మెరకముడిదాం ఎంపిఒ సరెండర్, సివిల్ సప్లయి పూర్వ డిఎంపై విజిలెన్స్ విచారణకు ఆదేశం, ఆర్‌అండ్‌బి, రవాణా శాఖ అధికారులకు అంటించిన చురకలు, మరిన్ని శాఖల పనితీరుపై ఆగ్రహం యావత్తు అధికార యంత్రాంగాన్ని ఉలికిపాటుకు గురిచేశాయి. అయితే, ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ లోపాలను అంగీకరించడం తప్ప, చేసిన ఘనకార్యాలను చెప్పుకోలేని పరిస్థితి. మద్యం దుకాణాల్లో నాసిరకం మద్యం విక్రయిస్తున్నారని, అదే బార్లలో అయితే బ్రాండెడ్ మద్యాన్ని అందుబాటులో ఉంటోందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన చెప్పగానే ఎంపీ అప్పలనాయుడు స్పందిస్తూ ఇదే విషయమై తనకు సుమారు 50వరకు ఫోనులో ఫిర్యాదులు వచ్చాయని సమావేశం సాక్షిగా చెప్పారు. ఇంకొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా బేబినాయన చెప్పింది చాలా వేల్యుబుల్ పాయింట్ అంటూ చెప్పుకొచ్చారు. కానీ, ఇప్పటి వరకు వారు ఎందుకు జోక్యం చేసుకోలేదు? అన్నది ప్రజలు సంధిస్తున్న ప్రశ్నలు. సర్వ జన ఆస్పత్రిలో తగిన వైద్యసేదలు అందడం లేదని, ఒకే బెడ్‌పై ఇద్దరు లేదా ముగ్గురు రోగులను వేస్తున్న సందర్భాలు కూడా ఉంటున్నాయని విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇదే అదునుగా , జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పందిస్తూ అసలు ఆసుపత్రిలో ఏయే జబ్బులకు వైద్యసేవలందిస్తున్నారో, ఏసేవలు స్థానికంగా అందుబాటులో లేవో ఇప్పటికైనా ప్రభుత్వానికి క్లారిటీ ఉందా? అంటూ చురకలంటించారు. దీనిపై అధికార యంత్రాంగం తెల్ల ముఖం వేసింది. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై నిరంతరం పర్యవేక్షిస్తున్నామంటూ డిపిఒ చెప్తుండగా, గ్రామాల్లో ఏం జరుగు తుందో మాకు తెలుసులే...! అంటూ సాక్షాత్తు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనితే వ్యంగ్యస్త్రాలు సంధించారు. పర్యవేక్షణ బాధ్యత ఎందుకు తీసుకోలేదని ఎమ్మెల్యేలను అడగడానికి బదులు డిపిఒను మాత్రమే నిలదీశారు. తాను బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచీ ఇప్పటి వరకు దాదాపు అన్ని మండలాల్లోనూ ఫీల్డ్ విజిట్లు చేశానని డిపిఒ చెప్తుండగా...ఎన్ని మండలాలు కాదు...ఎన్ని గ్రామాలు తిరిగారు? అంటూ ఒకింత ఆగ్రహం వ్యక్తం చేయడంలో అర్థమేమైనా ఉందా? అంటూ సాక్షాత్తు అధికార యంత్రాంగం నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు (ఫైల్)

19న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

రేసులో శరత్, శ్రీనివాసరావు



శరత్



శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ఈనెల 19న జరగనుంది. మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణపై 10మంది వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు, 10మంది టిడిపి కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టడంతో గతనెల 29న అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించి ఓటింగ్ పెట్టారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో చైర్మన్ పదవికి సావు వెంకట మురళీకష్ణ అర్హత కోల్పోయారని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి జీవో జారీ చేశారు. దీంతో చైర్మన్ ఎన్నికకు రంగం సిద్ధం చేస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 19న మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి చైర్మన్ ను ఎన్నుకోనున్నారు.

ఎన్నికల అధికారిగా ఆర్‌డిఒ రామ్మోహనరావు

మున్సిపల్ చైర్మన్ ఎన్నికల అధికారిగా ఆర్‌డిఒ రామ్మోహనరావును నియమిస్తూ కలెక్టర్ అంబేద్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. అవిశ్వాస తీర్మానం ఓటింగ్‌కు కూడా అధికారిగా రామ్మోహనరావు వ్యవహరించారు.

చైర్మన్ రేసులో శరత్, శ్రీనివాసరావు

మున్సిపల్ చైర్మన్ పదవి రేసులో టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు ఉన్నారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థిగా గెంబలి శ్రీనివాసరావు పోటీ చేసి ఎన్నికలు వ్యయాన్ని భరించారు. అప్పటిలో 10 వార్డులలో టిడిపి, 21 వార్డులలో వైసిపి విజయం సాధించడంతో వైసిపి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. అవిశ్వాస తీర్మానంతో చైర్మన్ పదవి టిడిపికి రావడంతో 2020 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తనకు మున్సిపల్ చైర్మన్ పదవి ఇవ్వాలని గెంబలి శ్రీనివాసరావు పట్టుబడుతున్నట్లు చర్చ జరుగుతోంది. అవిశ్వాస తీర్మానంతో కాపు సామాజిక వర్గానికి చెందిన సావు మురళి చైర్మన్ పదవి కోల్పోవడంతో కాపు సామాజిక వర్గానికి చెందిన రాంబార్కి శరత్ కు చైర్మన్ పదవి ఇవ్వాలని టిడిపికి మద్దతు ఇచ్చిన వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు షరతు పెట్టారు. ఈనేపథ్యంలో చైర్మన్ పదవి శరత్ కు వచ్చే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది.

పైప్ లైను బాధిత రైతాంగ సమస్యలపై

16న కలెక్టరేట్ వద్ద రైతు సంఘం ధర్నా

ప్రజాశక్తి - జామి

విశాఖ - రాయపూర్ మధ్య హెచ్‌పిసిఎల్ పైపులైను మార్గంలో జిల్లాలో 10 మండలాలకు చెందిన సుమారుగా 45 గ్రామాల రైతాంగం భూ నష్ట పరిహారం విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని రైతు సంఘం జిల్లా నాయకులు బుద్ధ రాజు రాంబాబు అన్నారు. ఈ నేపథ్యంలో వారికి సరియైన నష్ట పరిహారం చెల్లించాలని పైపులైనుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్న డిమాండ్లతో ఈ నెల 16న కలెక్టరెట్ వద్ద చేపడుతున్న ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ మేరకు మండలంలోని విజినిగిరి గ్రామంలో రైతుల డిమాండ్ల కరపత్రాన్ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పైపు లైను భూసేకరణలో మార్కెట్ విలువకు లెక్కగట్టి భూసేకరణ చట్ట ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఇప్పటికే నిర్మాణంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ హైవే పక్క నుంచి పైపు వేసి రైతుల భూముల జోలికి వెళ్లోద్దని సూచించారు. ఈ నేపథ్యంలోనే పలు డిమాండ్లతో ఈ నెల 16 న కలెక్టరేట్ వద్ద చేపడుతున్న ధర్నా కార్యక్రమం బాధిత రైతులు భారీగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రంలో కె.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, మెరుగైన శానిటేషన్ అందించాలి

- స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయాలి
- రాష్ట్రంలో గాడి తప్పిన కూటమి పాలన
- వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలకు తాగునీరు, మెరుగైన శానిటేషన్ అందించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం జెడ్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం జరిగిన జిల్లా సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాల తెలియజేశారు. ముఖ్యంగా ప్రజారోగ్యం దృష్టిలో పెట్టుకొని గ్రామీణ వైద్య ఆరోగ్యశాఖ శుభ్రంగా పనిచేయాలన్న ముందుగా స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయాలని, అప్పుడే ప్రజలకు తాగునీరు, శానిటేషన్ అందుతాయని తెలిపారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే కార్యాచరణ పొందేలా చూడాలని సూచించారు. కూటమి ప్రభుత్వ పాలనలో రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా ఎన్నికలలో ఇచ్చిన హామీలను గాలి కొదిలేసిందని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిని మరిచి, కేవలం వైసిపి నాయకులపై, పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపిసున్నాయని, వైసిపి నేత విడదల రజినీపై పోలీసులు అనుచితంగా వ్యవహరించారని ఆరోపించారు. ఉత్తరాంధ్రలో రెండో ప్రధాన పంట అయిన చెరుకు పండించే రైతాంగానికి కూటమి ప్రభుత్వం చెరుకు కర్మాగారాలన్నీ మూసి వేయించి, వారి ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో రైతాంగానికి మేలు చేసే రైతు భరోసా లాంటి ఎన్నో పథకాలు తీసుకువస్తే, కూటమి ప్రభుత్వం వాటిని పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం రాష్ట్ర అభివద్ధి, సంక్షేమం పైన దృష్టి పెట్టాలని, లేదంటే ప్రజా పోరాటం తప్పదని హెచ్చరించారు.

అనుకోని విపత్తు సంభవిస్తే..!

● ప్రభుత్వ శాఖల మాక్ డ్రిల్ ● అప్రమత్తంగా ఉండాలి : జెసి సేతుమాధవన్



గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్నట్లు...

ప్రజాశక్తి- కంటోన్మెంట్, కోట

అకస్మాత్తుగా ఏదైనా విపత్తు సంభవిస్తే...విపత్కర, సంక్షోభ పరిస్థితులు ఎదురైతే....యుద్ధం వల్ల బాంబులు పడి లేదా గ్యాస్ లీక్, షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటే....అలాంటి సమయంలో ప్రభుత్వం ఏవిధమైన సహాయ చర్యలు తీసుకుంటుంది?, వివిధ ప్రభుత్వ శాఖలు ఎటువంటి చర్యలు చేపడతాయి? ఆయా శాఖల సిబ్బంది ప్రాణాలకు తెగించి ప్రజలను ఏవిధంగా కాపాడతారు? అనే అంశాలను కళ్లకు కట్టినట్టు చేసి చూపించారు. బాంబులు, ఇతర పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే విధానాన్ని కూడా వివరించారు.

జిల్లా విపత్తుల యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో మంగళవారం సాయంత్రం మాక్ డ్రిల్ నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్యారోగ్య శాఖ, ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఆర్‌టిసి తదితర శాఖలు ఈ విన్యాసాల్లో భాగస్వాములు అయ్యాయి. పై అంతస్థులో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అక్కడికి అగ్నిమాపక సిబ్బంది చేరుకోవడం, క్షత గాత్రులను కిందకి దించడం, వారికి వైద్య సహాయాన్ని అందించడం, హుటాహుటిన ఆసుపత్రికి తరలించడం, అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ సిబ్బందికి ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయ పడటం, అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాని పక్షంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ దళాలు జత కలవడం, ప్రజల ప్రాణాలను రక్షించి, సహాయ చర్యలు చేపట్టడం తదితర అంశాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు. ప్రకతి వైపరీత్యాలతోపాటు, మానవ ప్రేరేపిత ప్రమాదాలను సైతం ఎదుర్కొనే విధానాన్ని వివరించి, తమ సన్నద్ధతను తెలియజేశారు. అదేవిధంగా జనసమ్మర్ధం ఉండే ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ లాంటి చోట్ల తీవ్రవాదులు బాంబులు లేదా ఇతర ప్రేలుడు పదార్థాలను పెడితే, వాటిని డాగ్ స్క్వాడ్ సహాయంతో కనుగొని నిర్వీర్యం చేసే విధానాన్ని సైతం ప్రత్యక్షంగా చూపించారు.



గాయపడిన వారికి చికిత్స చేస్తున్నట్లు...



మాక్‌డ్రిల్లును తిలకిస్తున్న అధికారులు

ఈ కార్యక్రమంలో జిల్లా విపత్తుల యాజమాన్యసంస్థ జిల్లా మేనేజర్ ఎం.రాజేశ్వరి, ఆర్‌డిఒ డి.కీర్తి, జిల్లా అగ్నిమాపక అధికారి బివిఎస్ రామ్ ప్రకాష్, జిల్లా వైద్యోరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి, జిజిహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ ఎస్.అప్పల నాయుడు, డిఎస్‌పి శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఎస్ఇ లక్ష్మణరావు, మున్సిపల్ కమిషనర్ పి. నల్లనయ్య, జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ, డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, ఎన్‌డిఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్రావు గాడే, ఎస్‌డిఆర్‌ఎఫ్ ఆర్‌ఎస్ఐ రఘు, తాహశీల్దార్ కూర్మనాథ్, సెక్షన్ సూపరింటిండెంట్ రామకృష్ణ తదితరులు తమ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

ఏదైనా విపత్తు లేదా అనుకోని ప్రమాదం సంభవించే సమయంలో నిర్వర్తించాల్సిన విధులపట్ల ప్రభుత్వ శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద వివిధ ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా చేపట్టిన మాక్ డ్రిల్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, ఇటువంటి మాక్ డ్రిల్ కారణంగా సిబ్బంది సన్నద్ధతను తెలుసుకోవచ్చునని అన్నారు. ఇలాంటి సమయంలో ప్రజలు ఏవిధంగా ప్రవర్తించాలన్న అంశం కూడా తెలుస్తుందని చెప్పారు. ఏదైనా విపత్తు సంభవించిన సమయంలో, దానినుంచి బయటపడేందుకు, ప్రభావితులను రక్షించేందుకు ప్రభుత్వ సిబ్బంది చేస్తున్న చర్యలకు ప్రజలు సంపూర్ణంగా సహకారం అందించాలని, సహాయ చర్యల్లో భాగస్వాములు కావాలని సూచించారు.



మంటల్లో చిక్కుకున్న వారిని రక్షిస్తున్నట్లు మాక్‌డ్రిల్లు చేస్తున్న సిబ్బంది

వెయిట్ లిఫ్టర్ పల్లవికి నగదు బహుమతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



పల్లవికి నగదు బహుమతి అందిస్తున్న విసి రాజు, ఝాన్సీలక్ష్మి

వెయిట్ లిఫ్టింగ్ లో బంగారు పతకం సాధించిన సత్య డిగ్రీ, పిజి కళాశాల విద్యార్థిని ఎస్. పల్లవికి స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాల, ధీరా ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం నగదు బహుమతిని అందించారు. ముఖ్య అతిధులుగా సెంచూరియన్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు, సత్య విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు. ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్క పోటీలోనూ మహిళలే ముందంజలో ఉంటారని అన్నారు. వెయిట్ లిఫ్టింగ్ ఎంత కష్టమైనది అయినా పల్లవి కనబరిచిన అద్భుతమైన ప్రదర్శన వలన భారత దేశానికి ఎంతో గౌరవం తీసుకొచ్చిందని అన్నారు. ఈ విజయాలు వెయిట్ లిఫ్టింగ్ రంగంలోనే కాకుండా సత్య విద్యాసంస్థలకు కూడా ఒక గొప్ప మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థిని పల్లవి సాధించిన ఈ విజయాలు అన్నింటి వెనుక తన కఠిన శ్రమ, పట్టుదలతో పాటు కోచ్ చల్లా రాము శిక్షణ ఉన్నాయని తెలిపారు.కామన్ వెల్త్ గేమ్ లో ఎంపిక కావడానికి ఆమె పౌష్టికాహారం కోసం ధీర ఫౌండేషన్, సత్య విద్యా సంస్థలు సంయుక్తంగా రూ.30వేలు నగదును గత ఆరు నెలలుగా అందజేస్తున్నారు. ఈ సహాయం ను పల్లవి కామన్ వెల్త్ లో ఎంపిక అయ్యే వరకు ఇస్తామని ఆమె చెప్పారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇంకా గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపల్ డివి రామమూర్తి, వరల్డ్ ఎనలిస్టు ఆర్‌యు నర్సింహం, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై గ్రామసభ

ప్రజాశక్తి- గజపతినగరం రూరల్



నవ ధాన్యాల ఉపయోగాలకు రైతులకు వివరిస్తున్న జెడిఎ రామారావు

ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కాలంరాజుపేట రైతు సేవా కేంద్రంలో నవధాన్యాల సాగుపై సర్పంచ్ గేదెల ఈశ్వరరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, ఎపిసిఎన్‌ఎఫ్ డిపిఎం ఆనంద్ రావు పాల్గొని నవధాన్యాల సాగు ఉపయోగాలపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవధాన్యాల సాగు వల్ల నేల గుల్లబారి సూక్ష్మజీవులు, వానపాములు, నేలలో నీటి నిల్వ సామర్థ్యం, ప్రధాన పంటలో చీడపీడలు తెగుళ్ల తట్టుకునే సామర్థ్యం పెరుగుతోందన్నారు. ప్రధాన పంటలో దిగుబడులు పెరిగి, ఎరువుల వినియోగం తగ్గుతుందని చెప్పారు. అనంతరం రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ మహారాజన్, మండల వ్యవసాయ అధికారి ధనలక్ష్మి, విఎఎ మస్తాన్ వలి, ఎపిసిఎన్‌ఎఫ్ సిబ్బంది, గ్రామ పెద్ద స్వామి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ పెంపే లక్ష్యం : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెవెన్యూ పెంపుదలే లక్ష్యంగా కృసి చేయాలని అడ్మిన్ కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలోని పన్ను పరిధిలోకి రాని నిర్మాణాలకు, తక్కువ పన్ను ఉన్న భవన నిర్మాణాలకు పన్ను విధించే విధంగా చొరవ చూపాలన్నారు. ప్రతిరోజు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి భవనాల కొలతలను నమోదు చేసుకొని తదనుగుణంగా పన్నులను విధించాలని చెప్పారు. చాలా ప్రాంతాలలో అదనపు భవన నిర్మాణాలకు పన్ను విధింపు లేకుండా ఉన్నాయని గుర్తించామని కావున తక్షణమే అటువంటి భవనాలను గుర్తించి పన్ను పరిధిలోకి తీసుకురావాలని చెప్పారు. షాప్‌లు, రూములు అద్దె బకాయలు వసూలు, ఖాళీగా ఉన్న షాపులకు వేలంపాట నిర్వహించడం, ఖాళీ స్థలాల పన్నులు విధించడం వంటి విధానాలను ఈ నెలాఖరులోగా త్వరితగతిన చేపట్టి లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. సమావేశంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు

నగరంలో కమిషనర్ పర్యటన

కమిషనర్ పల్లి నల్లనయ్య 6వ డివిజన్‌లోని జమ్ము, ఆనందపురం, సాయికాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. కాలువల పరిస్థితి, పారిశుధ్య విధానాన్ని గమనించారు. అనంతరం 7వ నెంబర్ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సకాలంలో సచివాలయ కార్యదర్శులు విధులకు హాజరవుతున్నారా లేదా అన్నది రికార్డులను పరిశీలించారు. పౌర సేవలు ఏ విధంగా అందిస్తున్నారు అన్న విషయాలపై ఆరా తీశారు. అనంతరం అన్నాక్యాంటీన్ పరిశీలించి ప్రజలకు అందుతున్న ఆహారం పట్ల ప్రజాభిప్రాయాన్ని సేకరించారు.



సచివాలయంలో అటెండెన్స్ రికార్డు పరిశీలిస్తున్న కమిషనర్

లక్షింపేటలో ఎస్‌పి పర్యటన

ప్రజాశక్తి - వంగర



పోలీసుస్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి

మండలంలోని లక్షింపేటలో జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ మంగళవారం పర్యటించారు. ఆ గ్రామంలో ఉన్న ప్రత్యేక కోర్టు పరిసరాలను పరిశీలించారు. గ్రామంలో గల పలు వీధులలో పర్యటించారు. చీపురుపల్లి డిఎస్‌పి ఎస్ రాఘువులు, రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్రరావుతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని సూచనలు చేశారు. అనంతరం అక్కడ నుండి వంగర పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా లక్షింపేట దళితులతో పాటు సంఘ నాయకుడు గణపతి జిల్లా ఎస్‌పిని కలిసి మాట్లాడుతూ తమకు పూర్తిస్థాయి న్యాయవాదిని ఇప్పించాలని కోరగా ఈ విషయాన్ని ఉన్నత స్థాయి అధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వంగర ఎస్ఐ షేక్ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పలు కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కంటోన్మెంట్



టిడిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయ నగరం నియోజకవర్గం పరిధిలో నారాయణ పురంలో పలు కుటుంబాలు మంగళవారం టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరజాఉ ప్రారంభించారు. గ్రామానికి చెందిన వైసిపి నాయకులు గడదీసు సూరీడు, పడగల అప్పలనాయుడు ,గజ్జ భాను ,గజ్జ శ్రీను ,గండబోయిన సంతోష్, గడదీసు రాజు ఎం. ప్రకాష్ తో పాటు సుమారు 150 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అందరికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. రాబోయే కాలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, సీనియర్ నాయకులు అవనాపు విజయ్ పాల్గొన్నారు



వేతన దారులతో మాట్లాడుతున్న పీడీ శారదాదేవి

ఉపాధి పనులను పరిశీలించిన పీడీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని రామతీర్థం, పెదబూరడపేట పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ ఎస్.శారదా దేవి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామతీర్థం పంచాయతీ తాటిమానుకు చెరువు పనులు పరిశీలించి ఉపాధి కార్మికులను రెండుపూటలు పనులకు హాజరవ్వాలని, ఉదయం 5.30 గంటల నుండి 10.30 గంటలు వరకు మధ్యాహ్నం 4.గంటలు నుండి 6 గంటలు వరకు పనులు చేస్తే రూ. 307 కూలీ వస్తుందని చెప్పారు. కొలతలు ప్రకారం పనులు చేస్తే తప్ప డబ్బులు సక్రమంగా రావన్నారు. పెదబూరడపేట పంచాయతీలో పారం పాండు పనులను పరిశీలించి అన్ని పంచాయతీల్లో పారంపాండు పనులను తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎపిఒ రామారావు తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

సంతకవిటి: కొలతలు ప్రకారం పని చేస్తే రోజుకి 307 రూపాయలు కూలీ వస్తుందని ఉపాధి కూలీలకు ఎపిఒ ఆర్. హరినాధ్ సూచించారు. ఈ మేరకు మంగళవారం సంతకవిటి మండలంలోని అప్పల అగ్రహారం, మిత్తివలస గ్రామాల్లో ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉపాధి పని ప్రదేశంలో నీరు, నీడ, మెడికల్ కిట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. కూలీలు రెండు పూటలా పని చేస్తే పనికి తగ్గ వేతనం అందుతుదని తెలిపారు. 206 మంది ఉపాధి కూలీల మాస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వం నుండి ఉపాధి పనిముట్లు వస్తే సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈసి ఎం.రామినాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయీ బ్రాహ్మణులు

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని నాయీ బ్రాహ్మణుల సంఘ భవన నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని టిడిపి క్యాంపు కార్యాలయంలో మంగళవారం మండల నాయీ బ్రాహ్మణులు మర్యాదపూర్వంగా కలిసి తమగోడు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే భవన నిర్మాణానికి సహకరిస్తామన్నారు. నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస టిడిపి నాయకులు లాలం అర్జున్ రావు, నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.

20న జిల్లా స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఎన్‌కెఆర్‌పురం గ్రామంలో ఈనెల 20వ తేదీన తుడుపులమ్మతల్లి అమ్మవారి పండగ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్లు పరుగు ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని దీవెనలు పొందాలని, ఆసక్తి ఉన్న వారు పోటీలో పాల్గొనాలని కోరారు.

యువకునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తి పంచాయతీ శివారు దుంగాడ గ్రామానికి చెందిన యువకుడు జోడు దేముడు బాబుకి గ్రామానికి చెందిన త్రిపురమాంబ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు మంగళవారం రూ.10వేలు ఆర్థిక సహాయం చేసి అప్పన్న హస్తం అందించారు. దేముడు బాబు ఇటీవల తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడడంతో కుడికాలు మడమ దగ్గర విరిగిపోయింది. దేముడు బాబు ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో గ్రామానికి చెందిన త్రిపురమాంబ హెల్పింగ్ హాండ్ సభ్యులు ఆర్థిక సహాయం చేయడంతో ఆ కుటుంబీకులు త్రిపురమాంబ హెల్పింగ్ హ్యాండ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు కాపు వెంకటేశ్వర్‌రావు, ఉగ్గిన శ్రీనివాసరావు, కొప్పల దేవి, వరపుల సన్యాసిరావు, కొప్పల వెంకట అప్పారావు, కొప్పుల సన్యాసి దొర తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం అంగన్వాడి 2 కేంద్రంలో కిశోర బాలికలకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గూర్చి వివరించి హెల్ప్ లైన్ నంబర్లు తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఓఆర్ఎస్ వాడటం వల్ల కలిగే ప్రయోజనాలు హ్యాండ్ వాషింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. ఈ అవగాహన సదస్సులో ఐసిడిఎస్ సూపర్వైజర్ కామేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

ప్రజాశక్తి - వేపాడ

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ మంగళవారం బల్లంకిలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ప్రచారం చేశారు. పాఠశాలలో విద్యార్థులు సంఖ్యను పెంచేందుకు గ్రామ పెద్దలను, తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పిస్తే నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. ప్రభుత్వం ఇస్తున్న వివిధ పథకాలను ఉపయోగించుకోవాలనోరారు.

విద్యార్థులకు డ్రాయింగ్‌లో శిక్షణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు రవీంద్ర భారతి స్కూల్ డ్రాయింగ్ టీచర్ త్రినాధ్ ఆధ్వర్యంలో డ్రాయింగ్ నేర్పించారని గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ తెలిపారు. విద్యార్థులు క్యారం బోర్డ్, చదరంగం, క్రాఫ్ట్ మొదలగు ఆటలు ఆడారన్నారు. ఈ కార్యక్రమంలో 25 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఆయన చెప్పారు.

అనధికార షాపులను తొలగించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఎదుట అనధికారకంగా వెలిసిన దుకాణాలను తొలగించాలని వార్డు సభ్యుడు చిప్పాడ శేషగిరి పంచాయతీ అధికారులను కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి ముందు కొంతమంది వ్యక్తులు అనాధికారకంగా రేకుల షెడ్లుతో పర్మనెంట్ షాపుల కింద మార్చుకొని ప్రభుత్వ భూములపై ఈ విధంగా కట్టడాలు నిర్మించడం వల్ల రానున్న రోజుల్లో ఆసుపత్రి రద్దీ పెరగడంతో పార్కింగ్ సదుపాయానికి ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. ఆస్పత్రి ముందు ఉన్న అనాధికార షాపులను తొలగించి హాస్పిటల్‌కి వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని రోగులు, రోగులు కొరకు వచ్చేవారి వాహనాలు నిలిపేందుకు ఆక్రమణ తొలగించి షెడ్లు నిర్మించి ప్రభుత్వ భూమిని కాపాడతారని రెవెన్యూ పంచాయతీ అధికారులను కోరుతామన్నారు.

అవయవ దానానికి ముందుకొచ్చిన దంపతులు

ప్రజాశక్తి - చీపురుపల్లి

'మా ఈ దేహ సంపదను మా తదనంతరం మరికొన్ని ప్రాణాలను నిలబెట్టేందుకు ఇవ్వాలని' శివకు బంగారయ్య, రామలక్ష్మి దంపతులు చీపురుపల్లికి చెందిన మానవీయత స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు బివి గోవిందరాజులుకి వారి స్వహస్తాలతో సంతకాలు చేసిన అంగీకార పత్రాలను అందజేశారు. నెల్లిమర్ల మండలం తంగుడుపల్లి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సివుకు బంగారయ్య, విఆర్‌ఒగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రామలక్ష్మి దంపతులు సామాజిక బాధ్యతగా గుర్తించి వారి తదనంతరం వారి శరీర భాగాలను దానం చేసేందుక అంగీకార పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ జన్మ భగవంతుడు తమకు ఇచ్చిన గొప్ప వరం అని, ఈ అవకాశాన్ని సమాజ సేవలో సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు వచ్చామని అన్నారు. తాము జీవించి ఉన్నంత వరకు ఈ శరీరాన్ని మంచి పని చేయడం కోసం ఒక సాధనంగా వాడుతామని తెలిపారు. శరీరం వదలాల్సిన స్థితి లోకంలో రాజుకైనా, పేదవానికైనా తప్పదని, ప్రాణాలు విడిచి వెళ్లేటప్పుడు తమ శరీర భాగాలు ఇతరులకు ఉపయోగపడేటట్లుగా అవయవ దానం చేసేందుకు సిద్ధపడ్డామన్నారు. తాము మరణిస్తూ ఇంకొకరికి కొత్త జీవితాన్ని అందిస్తే అంతకంటే గొప్పతనం ఏముంటదని చెప్పారు. అవయవ దానం ద్వారా తాము మరణిస్తూ మరెన్నో ప్రాణాలకు ఊపిరి పోయవచ్చని, మరణం అంచున ఉండేవారికి కూడా జీవితాన్ని ప్రసాదించవచ్చని వారు తెలిపారు.

చెరువులకు రక్షణ కరువు

- పరిరక్షణపై రెవెన్యూ అధికారుల మీనమేషాలు
- చెరువుల ఆక్రమణ ఫిర్యాదుపై మల్లగుల్లాలు
- రోవర్లు పనిచేయటం లేదంటూ దాటవేత

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని కిల్లంపాలెం రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 187/1లో 4 ఎకరాల 88 సెంట్లు విస్తీర్ణం గల పిల్లివాని చెరువు, సర్వే నెంబర్ 163/1లో ఎకరా 90 సెంట్లు శివన్న చెరువు, సర్వేనెంబర్ 153లో రెండెకరాల విస్తీర్ణం గల మొగలాయి చెరువు గర్భాలు ఆక్రమణలకు గురయ్యాయి. చెరువు గర్భాల విస్తీర్ణం సర్వే ద్వారా గుర్తించి, హద్దులు నిర్ధారించి, ట్రంచ్ కటింగ్ ఏర్పాటు చేసి చెరువులను పరిరక్షించి ఆయకట్టు రైతులకు నీరు అందేలా చేయాలని ఇటీవల కొంత మంది ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనికి పరిష్కారం చూపాలని జిల్లా అధికారుల నుండి వచ్చిన ఆదేశాలకు మండల రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కించారు. ఫిర్యాదుకు పరిష్కారం చూపుతామని ఫిర్యాదు దారునికి తెలిపి సర్వే చేసేందుకు ఎస్‌కోట బేస్ స్టేషన్ రోవర్ పనిచేయటం లేదని దాటవేత ధోరణి అవలంబించారు. ఈ చెరువుల ఆక్రమణపై గతంలోనూ పలువురు ఫిర్యాదులు చేసినప్పటికీ సర్వే చేయిస్తాం, ఆక్రమణల తొలగిస్తాం, చెరువు గర్భాలను స్వాధీనం చేసుకుంటాం అని ఏళ్ల తరబడి అధికారులు చెబుతున్నారే తప్ప చెరువు గర్భాల ఆక్రమణలను తొలగించలేకపోవటం గమనార్హం.

చెరువులు రైతుల పాలిట కల్ప వృక్షాలు. చెరువు బాగుంటే వర్షపు నీరు నిల్వ ఉంటుంది. తద్వారా ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందుతుంది. రాష్ట్రంలో ఎక్కడా లేనన్ని చెరువులు జిల్లాలో ఉన్నాయి. వ్యవసాయానికి, భూగర్భ జలాలు పెరగటానికి, వాతావరణాన్ని చల్లబరచడానికి ఆధారమైన చెరువులు వాటి గర్భాలు ఒక్కొక్కటి ఆక్రమణకు గురవుతున్నాయి. సాగునీటి ఆధారం లేకుండా చేసి రైతన్నల ఆవేదనను మిగులుస్తున్నారు. స్వార్ధపరుల వ్యక్తిగత స్వార్ధం కోసం చెరువు ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. చెరువు గర్భాల ఆక్రమణలను గుర్తించి కొరడా ఝులిపించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు నిర్లక్ష్యంతో, మామూళ్ల మత్తులో జోగుతూ ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మండలంలో చెరువులు కనిపించకుండా కనుమరుగయ్యే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వమైనా చెరువుల కబ్జాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

చెరువుల గర్భాలు ఆక్రమణలు వాస్తవం

ఫిర్యాదుదారుడు ఫిర్యాదులో తెలిపినట్లు మూడు చెరువుల గర్భాల ఆక్రమణలకు గురైన మాట వాస్తవం. ఫిర్యాదుదారునికి ఆక్రమణలకు గురైన చెరువుల గర్భాలను చూపించాం. రోవర్ పనిచేయకపోవటం వల్ల చెరువుల హద్దులు నిర్ధారించలేకపోయాం. చెరువు గర్భాల ఆక్రమణ తొలగింపునకు ఇరిగేషన్ శాఖ అధికారులు సహకారం అవసరం.

వి.ఆర్‌ఒ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి మధు

ఉపాధి హామీ ద్వారా చెరువులకు ట్రంచులు ఏర్పాటు చేయాలి

మండలంలో చెరువు గర్భాల ఆక్రమణ రోజురోజుకు పెరుగుతుంది. పదేళ్లలో మండలంలో 60 శాతం మేర చెరువులు కనుమరుగయ్యాయి. జల వనరుల ఆక్రమణలకు గురైతే సాగునీటికి తాగునీటికి ఇబ్బందులు ఏర్పడతాయి. అందు వల్ల ఆక్రమణకు గురైన చెరువు గర్భాలను సర్వే చేసి, విస్తీర్ణం గుర్తించి, హద్దులను నిర్ధారించి, ఉపాధి హామీ పథకం నిధులతో ట్రంచ్ కటింగ్ ఏర్పాటు చేయాలి. చెరువుల ఆక్రమణల తొలగింపుపై అలసత్వం వహిస్తే ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆయకట్టు రైతులతో కలిసి ఆందోళన పోరాటాలు చేపడుతాం.

ముత్యాలనాయుడు, ఉత్తరాంధ్ర చెరువులు పరిరక్షణ మండల అధ్యక్షులు, ఎస్‌కోట.



పిల్లి వాని చెరువు గర్భం ఆక్రమించి వేసిన చెరుకు పంట.

ఆక్రమణదారులపై చర్యలు చేపడతాం



రోవర్ పని చేయకపోవడం వల్ల రెవెన్యూ సిబ్బంది హద్దులు నిర్ధారించలేకపోయారు. ఫిర్యాదుదారుడు కోరుకుంటే హద్దులను నిర్ధారిస్తాం. గతాధికారులు చెరువు గర్భాల ఆక్రమణల సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోయారో పరిశీలిస్తాం. ట్రంచ్ కటింగ్ ఏర్పాటు చేయాలని జలవనరుల శాఖ అధికారులకు తెలియజేస్తాం. ఆక్రమణలుంటే కచ్చితంగా ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం.

ఎం. అరుణకుమారి, తహశీల్దార్, ఎస్‌కోట

ఘనంగా పైడితల్లమ్మ పండగ


ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని అక్కివరం గ్రామంలో పైడితల్లమ్మ పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. సిరిమానోత్సవానికి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. గ్రామంలో ఈ పండగ 120 ఏళ్ల తరువాత నిర్వహించడంతో పెద్ద ఎత్తున యాత్రికులు వచ్చారు. సుమారు కోటి రూపాయల వరకు పండగ నిమిత్తం ఖర్చు పెట్టారు. గత నెల 22వ తేదీ నుంచి పండగ ఏర్పాట్లు చేశారు. ఈ నెల నాలుగవ తేదీన పలు సాంస్కృతిక కార్యక్రమాలతో మేల తాళాలు ఊరేగింపుగా గ్రామ పొలిమేరలో ఉన్న గుడి నుంచి అమ్మవారిని గ్రామంలోనికి తీసుకు వచ్చారు. అప్పటి నుంచి గ్రామస్తులందరూ పూజలు నిర్వహించారు. మంగళవారం సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సిరిమానును గ్రామానికి చెందిన పూజారి కంది వెంకటరమణ అధిరోహించాడు. ఈ సిరిమానును గ్రామంలో మూడుసార్లు తిప్పారు. గ్రామంలో 120 ఏళ్ల తర్వాత జరుగుతున్న పండగ కాబట్టి గ్రామస్తులు భారీగా బంధువులకు చెప్పుకొని ఒక్కొక్క ఇంటి నుంచి రెండు లక్షల నుంచి 5 లక్షల వరకు ఖర్చుపెట్టి పండగ ఘనంగా నిర్వహించారు. సిరిమానును ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, మాజీ జెడ్‌పిటిసి కంది సూర్యానారాయణ, సర్పంచ్ కంది కిరణ్‌కుమార్ సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక ఎస్ఐ ఎ.సన్యాసి నాయుడు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో డెంకాడ పిహెచ్‌సి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. అమ్మవారి సిరిమానును వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, పూసపాటిరేగ వైసిపి మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైసిపి నాయకులు బాలి సత్యనారాయణ, కంది త్రిమూర్తులు, జనసేన, వైసిపి, టిడిపికి చెందిన పలువురు నాయకులు సిరిమానును దర్శించుకున్నారు.



డెంకాడలో ఊరేగుతున్న సిరిమాను

- సిరిమానోత్సవానికి తరలివచ్చిన యాత్రికులు



వేపాడ: అమ్మవారి వేశధారణలో కళాకారుడు

వైభవంగా పైడితల్లమ్మ అనుపోత్సవం

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో మంగళవారం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి అనుపోత్సవం వైభవంగా నిర్వహించారు. పండగ సందర్భంగా బండి ప్రభ, మహిళా కోలాటాలు, భారీ మందు గుండు కాల్పులతో కాంగో బ్యాండ్ మేళం డప్పు వాయిద్యాలతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా డాన్స్ బేబీ డాన్స్, జానపద నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ పండగలో ఏ విధమైన అవంతరాలు జరగకుండా గ్రామ సర్పంచ్ వంటాకు రామయ్యమ్మ, ఉప సర్పంచ్ వంటాకు శ్రీను, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. వల్లంపూడి పోలీస్ స్టేషన్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

చలో ఉర్దూ లైబ్రరీ

ప్రజాశక్తి- బొబ్బిలి

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్, సెక్రటరీ ఆదేశాల మేరకు ఉర్దూ అకాడమీ లైబ్రరీ బొబ్బిలి ఆధ్వర్యంలో మంగళవారం చలో ఉర్దూ లైబ్రరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. లైబ్రేరియన్ ఎంఎ ఖుద్దూస్ మాట్లాడుతూ భారతదేశ ప్రాచీన భాష ఉర్దూ భాష అని, రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూని ద్వితీయ భాషగా గుర్తించిందని గుర్తు చేశారు. ఉర్దూ భాషను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఉర్దూ ప్రేమికులు, ఉర్దూ సాహితివేత్తలు, విద్యార్థులు ఉర్దూ భాష ప్రాముఖ్యతను గుర్తించడానికి ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ అధ్యక్షులు సయ్యద్ హాజీ పీరా, మున్సిపల్ కోఆప్షన్స్ సభ్యులు రియాజ్ ఖాన్, హుదా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సభ్యులు షేక్ జాఫర్, హమీద్, సయ్యద్ బాబ్జి, రహీమ్ ఖాన్, జి.ఎం.ఖాన్, మదీనా, షాజాదా, నాగు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమ్మెతో మోడీకి వణుకు పుట్టాలి

ప్రజాశక్తి- శృంగవరపు కోట

నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని ఈనెల 20వ తేదీన అన్ని కార్మిక సంఘాలతో నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెతో మోడీకి వణుకు పుట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్, అధ్యక్షులు ఎం.శంకర్రావు, మెడికల్ రిప్రజెంట్స్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యుఎస్ రవికుమార్ అన్నారు. కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, జిల్లాలో మూతపడిన పరిశ్రమలు తెలిపించాలని కార్మిక సమస్యలను పరిష్కరించాలని ఈనెల 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ అధ్యక్షతన నిర్వహించిన జీపుజాత మంగళవారం సాయంత్రం పట్టణంలోని దేవి కూడలికి చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశవ్యాప్త సమ్మె సందర్భంగా ఈనెల 20న పనిబందు చేయాలని, సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి సుధారాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు చెలికాని ముత్యాలు, అంగన్వాడీలు, ఆశాలు, ఆటో కార్మికులు, మిడ్డే మీల్స్ కార్మికులు పాల్గొన్నారు.

కొత్తవలస: మే 20వ తేదీన జరగబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ పిలిపిలిచ్చారు. మంగళవారం కొత్తవలస అంబేద్కర్ జంక్షన్ వద్ద సిఐటియు నాయకులు గాడి అప్పారావు అధ్యక్షతన జీపుజాత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే. సురేష్ మాట్లాడుతూ రవాణా రంగంపై ఆధారపడి బతుకుతున్న మన ఆటో డ్రైవర్ల అందరికీ నష్టం కలిగించే విధంగా బిఎన్ఎస్ అనే భారతీయ న్యాయ సంహిత అనే చట్టాన్ని తీసుకొచ్చి మన మెడపై కేంద్రంలో మోడీ ప్రభుత్వం కత్తి పెట్టిందన్నారు. దీన్ని తిప్పి కొట్టడానికి సమ్మెలో పాల్గొనాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి శంకర్రావు మాట్లాడుతూ ప్రభుత్వాలు చదువుకున్న యువతీ యువకులుకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడంతో ఉన్న కొద్దిపాటి భూమిని అమ్ముకుని అప్పులు చేసుకొని ఆటోలు కొనుక్కొని వాటి మీద ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారని, ఈ బతుకు కూడా లేకుండా ప్రభుత్వం మల్టీ నేషనల్ కంపెనీలకు ఓబర్, వాలా వంటి సంస్థలకు పర్మిషన్ ఇచ్చి వాటి ద్వారా ప్రయాణ సౌకర్యాలు కల్పించే విధంగా పన్నాగం పన్నిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి. సుధారాణి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కాకర తులసి, ఆటో కార్మికులందరూ పాల్గొన్నారు.

లక్కవరపుకోట: జీపు జాతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జీపుజాతా రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేసేందుకు ఉమ్మడి జిల్లాల్లో పది నుంచి 14 వరకు జీపు జాతా కార్యక్రమాన్ని తలపెట్టామని ఆయన తెలిపారు. వామపక్షాల పిలుపుమేరకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలు వ్యతిరేక విధానాలు ఖండిస్తూ ఈ కార్యక్రమం చేపట్టామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి శంకర్రావు, రాష్ట్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి యూఎస్ రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సూర్యనారాయణ, రాష్ట్ర ఆశ వర్కర్ యూనియన్ ఉపాధ్యక్షులు పి సుధారాణి, జిల్లా వ్యవసాయ సంఘం కార్యదర్శి గాడి అప్పారావు, సిఐటియు కమిటీ సభ్యులు గొల్ల దేవి, సిఐటియు మండల అధ్యక్షులు తరలి వెంకటరమణ, అప్పల నరస, దేవుడమ్మ, ఎర్రమ్మ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

నెల్లిమర్ల: ఈ నెల 20న జరిగే దేశవ్యాపిత సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ విద్యుత్ స్టోర్స్ హమాలీలకు కరపత్రం ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపిఎఫ్ పింఛన్ 9వేలు ఇవ్వాలని, జ్యూట్ రిటైర్డ్ కార్మికులకు గ్రాడ్యూటీ బకాయిలు వెంటనే చెల్లించి, ఈఎస్ఐ, పిఎఫ్ బకాయిలు చెల్లించి కార్మికులకు పింఛన్ సౌకర్యం, ఈఎస్ఐ వర్తింపు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ హమాలీలకు పని భద్రత కల్పించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించి వేతన దార్లకు రూ.600 వేతనం, 200 రోజులు పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ హమాలీ సంఘం నాయకులు పతివాడ లక్ష్మణరావు, కెల్ల గోవిందరావు, పతి వాడ పెద రాంబాబు, చిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలసలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

భోగాపురం: కార్మికులకు నష్టం కలిగించే చట్టాలను రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే. సురేష్ అన్నారు. ఈనెల 20వ తేదీన జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో జీపు జాతా ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బి సూర్యనారాయణ ఆధ్వర్యంలో భోగాపురంలో సమావేశం నిర్వహించారు. కార్మికులంతా ఇదే వ్యాప్త సమ్మెలో పాల్గొనాలని సురేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు పి శంకరరావు, పెద్ద అప్పారావు, దాసు, సందీప్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: ఈనెల 20న దేశవ్యాప్తంగా జరుగు సమ్మెను జయప్రదం చేయాలని అసంఘటిత రంగ కార్మికులు పిలుపునిచారు. ఈమేరకు స్థానిక గాంధీ పార్క్ లో అసంఘటిత రంగకార్మిక హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో సమ్మె గోడ పత్రికను కన్వీనర్ బి,గిరి ప్రసాద్ విడుదల చేశారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్రపాలకులు తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ వెంటనే రద్దు చేయాలని కనీస వేతనం నెలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే చర్యలు

ప్రజాశక్తి - బొబ్బిలి

ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని బలిజిపేట రోడ్డు, అగురువీధి, వరహగిరి వారిసందు, చిన్నబజారు, మార్కెట్ ప్రాంతాల్లో మంగళవారం ఆమె పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బలిజిపేట రోడ్డులో ఖాళీ స్థలాల్లో చెత్త ఉండడంతో తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీను ఆదేశించారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో చెత్త వేసిన వారిని గుర్తించి జరిమానా విధించాలన్నారు. మార్కెట్లో చెత్తను ఉదయం 6గంటల్లోపు క్లియర్ చేయాలన్నారు. కాలువలలో పూడికలు తొలగించాలని ఆదేశించారు. బలిజిపేట రోడ్డులో ఖాళీ స్థలంలలో ఉన్న చెత్తను ఏరివేయించాలని, గార్బేజ్ వల్ల రబుల్ పాయింట్లను క్లియర్ చేయించాలని ఆదేశించారు. అగురు వీధిలో ప్రమాదకర స్థితిలో ఉన్న మునిసిపల్ బావి గట్టు తొలగించి గట్టు తిరిగి నిర్మించాలని ఇంటి యజమానికి తెలియజేశారు. .

తూతూ మంత్రంగా సమావేశం

ప్రజాశక్తి- రాజాం

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఎల్.సులోచన అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా నిర్వహించారు. జెడ్‌పిటిసి బండి నరసింహులు, ఎంపిడిఒ శ్రీనివాసరావు, తహశీల్దార్ ఆధ్వర్యంలో సర్వసభ సమావేశం నామ మాత్రంగానే సాగింది. ప్రజా ప్రతినిధులు అధికారులు కొంత మంది రాకపోయినా వచ్చిన వారితోనే సమావేశాన్ని తూతూ మంత్రంగానే నిర్వహించి ముగించారు. సమావేశంలో కనీసం అభివృద్ధి పనులపై సమీక్ష జరగలేదు. గత సమావేశంలో లేవనెత్తి సమస్యల పరిష్కారం గురించి కూడా ఆరా తీయలేదు. రెవెన్యూ సమీక్షలో సిఎస్‌డిటి చిరంజీవులు మాట్లాడుతూ కొత్తగా రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న వారికి పెళ్లి సర్టిఫికేట్ లేకపోయినా పెళ్లి ఫొటోతో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. విద్యుత్ శాఖ సమీక్షలో ఎఇ కుమార్ మాట్లాడుతూ గత రెండు రోజులుగా గాలి, ఉరుములు, మెరుపులతో కురుస్తున్న వర్షం వల్ల 110 పోల్స్ వరకు విరిగిపోయాయని, 120 ఇళ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. వ్యవసాయం నిమిత్తం రైతులు కరెంటు కోసం దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి ఛార్జీలు కట్టాల్సిన పనిలేదన్నారు. డీపీ నుండి రైతు పొలం వరకు ఎన్ని పోల్స్ పడతాయో వాటికి మాత్రమే డబ్బులు కట్టాలని తెలిపారు. డాక్టర్ జి. భార్గవి మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో కొత్తగా టీబీ వ్యాక్సిన్ ప్రతి పిహెచ్‌సిలో అందుబాటులో ఉందని, పంచాయతీ పరిధి గ్రామాల్లో హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ వేసవి కాలంలో మండల పరిధిలో ఉన్న గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆయా గ్రామల సర్పంచులు, ఎంపిటిసిలు అధికారులను కోరారు. అనంతరం పాలవలస రాజశేఖరం మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు నక్క పద్మావతి, ఎల్.సునీత, నాయకులు చిన్నారావు, గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సులోచన

సిబిఎస్ఇ ఫలితాల్లో 'గ్లోబల్' సత్తా

ప్రజాశక్తి - రామభద్రపురం

అత్యంత ప్రతిష్టాత్మకమైన సిబిఎస్ఇ ఫలితాల్లో స్థానిక గ్లోబల్ వ్యూ ప్రైవేటు స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచినట్లు స్కూల్ కరస్పాండెంట్ చంద్ర మోహన్ తెలిపారు. 100 శాతం పాస్ పర్సంటేజ్‌తో 28 మంది, 24 మంది డిస్టింక్షన్ (70శాతం)లో పాస్ అవ్వడం చాలా గర్వ కారణంగా ఉందన్నారు. మిగిలిన 4 గురు విద్యార్థులు కూడా ఫస్ట్ క్లాస్ మార్కులతో పాస్ అయ్యారన్నారు. ఇంతటి ఘన విజయాన్ని అందించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులుకు, తమ ఉపాధ్యాయ బృందానికి గ్లోబల్ వ్యూ స్కూల్ యాజమాన్యం తరుపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు. వరుసగా రెండో విద్యా సంవత్సరంలో కూడా 95శాతం సాధించి జోనల్ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం గర్వ కారణమన్నారు.